# జకాతుల్ ఫిత్ర్

[ తెలుగు – Telugu – تلغو ]

షేఖ్ సాలెహ్ అల్ మునజ్జిద్

**అనువాదం :** ముహమ్మద్ కరీముల్లాహ్

**రివ్యూ :** షేఖ్ నజీర్ అహ్మద్

2012 - 1433

IslamHouse.com

# ﴿ زكاة الفطر ﴾

« باللغة تلغو »


شيخ صالح المنجّد

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد



2012 - 1433

IslamHouse.com

# జకాతుల్ ఫిత్ర్

## నిర్వచనం

జకాత్ అల్ ఫిత్ర్ ఎతేకాఫ్ అంటే రమదాన్ మాస ఉపవాసాల ముగింపు సందర్భంగా స్తోమత ఉన్న ప్రతి ముస్లిం తప్పనిసరిగా చేయవలసిన ఒక రకమైన విధిదానం. ఫిత్ర్ అనే పదానికి జకాత్ అనే పదం ఇదాఫహ్ (అరబీ వ్యాకరణంలోని షష్ఠి విభక్తి ఆకారంలో) గా చేర్చబడింది[1]. ఎందుకంటే ఉపవాసాలు పూర్తవటమే ఈ జకాతు తప్పని సరి కావటానికి కారణమైంది.

## జకాత్ అల్ ఫిత్ర్ ఎందుకు ఆదేశించబడింది ?

ఇబ్నె అబ్బాస్ రదియల్లాహు అన్హుమా ఇలా ఉల్లేఖించారు:

"వ్యర్థ కలాపాలు, అసభ్యకరమైన పలుకులు పలకటం మొదలైన వాటి నుండి ఉపవాసం పాటించిన వ్యక్తిని పరిశుద్ధపరిచే మాధ్యమంగా

---

[1]. అరబీ భాషలో 'ఫిత్ర్' అనే పదం 'ఫ□త□ర' అనే మూడు మూలాక్షరాల నుండి ఏర్పడింది. భాషాపరంగా దీని అర్థం 'ఉపవాసాన్ని ముగించటం'. అది రమదాన్ నెల ఉపవాసమైనా కావచ్చు లేదా ఉదయం నిద్ర లేచి ఏదైనా ప్రాత:కాల ఉపాహారం తినటమైనా కావచ్చు (ఇంగ్లీషులో 'బ్రేక్ ఫాస్ట్' అనే పదం యొక్క మూల పదాలు 'బ్రేక్' అంటే భగ్నం చేయుట మరియు 'ఫాస్ట్' అంటే ఉపవాసం అనే రెండు విడిపదాలతో ఏర్పడటాన్ని మీరు గమనించగలరు) (ఎడిటర్)

మరియు బీదవారికి భోజనం పెట్టటం కొరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జకాత్ అల్ ఫిత్ర్ ను తప్పనిసరి చేసారు. ఎవరైతే దీనిని నమాజు కంటే ముందే చెల్లిస్తారో, అది జకాత్ అల్ ఫిత్ర్ గా స్వీకరించబడుతుంది మరియు ఎవరైతే దీనిని నమాజు తర్వాత చెల్లిస్తారో, అది ఒక సాధారణ దానంగా మారిపోతుంది."[2]

'పరిశుద్ధపరచటం' అంటే రమదాన్ నెల ఉపవాసాలు పాటించిన వ్యక్తి యొక్క ఆత్మను పరిశుద్ధపరచటమని అర్థం. 'అసభ్యకరమైన పలుకులు' అంటే పదాల గురించి ఇబ్నె అల్ అథీర్ ఇలా పలికారు,

" 'అసభ్యకరమైన పలుకులు' అనే పదాలు అశ్లీల, బూతుమాటలను సూచిస్తున్నాయి. భోజనం పెట్టటం (బీదవారికి) తినదగిన భోజనాన్ని సూచిస్తుంది. నమాజు కంటే ముందే చెల్లిస్తారో అంటే సలాతుల్ ఈద్. జకాత్ అల్ ఫిత్ర్ గా స్వీకరించబడుతుంది అంటే ఇక్కడ జకాత్ అంటే సదకాత్ అల్ ఫిత్ర్. ఒక సాధారణ దానం అంటే మామూలుగా ఏ సమయం లోనైనా ఇచ్చే దానం అన్నమాట."[3]

---

[2] . అబూ దాఊద్ లో నమోదు చేయబడింది. అన్నవావీ ఇలా పలికారు: "అబూ దాఊద్ దీనిని ఇబ్నె అబ్బాస్ నుండి హసన్ ఇస్నాద్ (మంచి ఉల్లేఖకుల పరంపరం) ద్వారా నమోదు చేసారు"

[3] . ఔన్ అల్ మఆబూద్ షరహ్ అబి దాఊద్.

సూరహ్ అల్ ఆలా లోని క్రింది ఆయతు యొక్క అర్థమిదేనని చెప్పబడింది:

قَدْ أَفْلَحَ مَن تَزَكَّىٰ(١٤) وَذَكَرَ اسْمَ رَبِّهِ فَصَلَّىٰ(١٥)

"ఖద్ అఫ్లహ్ మన్ తజక్కా. వ జకరస్మ రబ్బిహీ ఫశల్లా." 87:14-15

"నిశ్చయంగా అలాంటి వారే వర్ధిల్లుతారు ఎవరైతే తమను తాము పరిశుద్ధపరుచుకుంటారో మరియు తమ సంరక్షకుడైన ప్రభువు పేరును స్తుతిస్తారో" 87:14-15

ఉమర్ ఇబ్నె అబ్దుల్ అజీజ్ మరియు అబుల్ ఆలియహ్ ఇలా పలికారని నమోదు చేయబడింది:

"ఆయన (ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం) జకాత్ అల్ ఫిత్ర్ చెల్లించారు మరియు నమాజు కొరకు అంటే సలాతుల్ ఈద్ కొరకు బయలు దేరారు."[4]

వకీ ఇబ్నె అల్ జర్రాహ్ ఇలా పలికారు:

"నమాజు కొరకు చేసే సజ్దా సహూ (నమాజు చేయటంలో ఏదైనా మరిచిపోతే, చేసే సజ్దాలు) వంటిదే రమదాన్ మాసం ముగిసినపుడు

---

[4]. అల్ జస్సాస్, అహ్కామ్ అల్ ఖుర్ఆన్, 3వ భాగం, సూరతుల్ ఆలా ఇలాహ ఇల్లల్లాహ్.

చెల్లించే జకాతుల్ ఫిత్ర్. ఎలాగైతే సహూ సజ్దాలు నమాజులోని కొరతలను పూర్తి చేస్తాయో, ఉపవాసంలో ఏవైనా కొరతలుంటే (ఏవైనా తప్పులు, లోపాలుంటే) అవి దీని ద్వారా పూర్తవుతాయి."[5]

## జకాతుల్ ఫిత్ర్ గురించిన ఇస్లామీయ ధర్మాదేశం

సరైన అభిప్రాయం ఏమిటంటే ఇది తప్పని సరి విధి (ఫర్ద్), ఎందుకంటే ఇబ్నె ఉమర్ ఇలా పలికారు: "రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జకాతుల్ ఫిత్ర్ ను తప్పనిసరి విధిగా (ఫర్ద్) ప్రకటించారు" మరియు ఉలేమాల ఏకాభిప్రాయం (ఇజ్మా) వలన ఇది ఫర్ద్..[6]

## జకాతుల్ ఫిత్ర్ ఎప్పుడు చెల్లించాలి ?

రమదాన్ నెల చివరి రోజున సూర్యుడు అస్తమించినప్పటి నుండి ఇది తప్పని సరి అయిపోతుంది. ఎవరైనా పెళ్ళి చేసుకుని, పసిబిడ్డ పొందినవారు, ఆదినపు సూర్యాస్తమయం కంటే ముందు ఇస్లాం స్వీకరించినవారు జకాతుల్ ఫిత్ర్ చెల్లించాలి (తన తరుఫున మరియు తన భార్య, పసిబిడ్డ తరుఫున కూడా). అయితే సూర్యాస్తమయం తర్వాత గనుక అది జరిగితే, అతను జకాతుల్ ఫిత్ర్ చెల్లించ వలసిన

---

[5] . అన్నవాలీ, అల్ మజ్మూఅ, ౬వ భాగం.

[6]. అల్ ముగ్నీ, ౩వ భాగం, బాబ్ సదఖత్ అల్ ఫిత్ర్.

అవసరం లేదు..... ఫిత్ర్ రాత్రి, సూర్యాస్తమయమైన తర్వాత ఎవరైనా చనిపోతే, ఆయన తరుఫున కూడా సదఖాతుల్ ఫిత్ర్ చెల్లించ వలసి ఉంది. అహ్మద్ తెలిపినది ఇదే."[7]

## ఎవరు విధిగా చెల్లించాలి?

1. జకాతుల్ ఫిత్ర్ ప్రతి ముస్లింపై తప్పనిసరి విధి. ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఇలా తెలిపారు: "బానిస లేక స్వతంత్రుడు, మగ లేక ఆడ, బాలుడు లేక ముసలివాడు అయిన ప్రతి ముస్లింపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, ఒక సాఅ ఖర్జూర పళ్ళు లేక ఒక సాఅ బార్లీ గింజల జకాతుల్ ఫిత్ర్ దానం చేయటాన్ని తప్పని సరి చేసారు."[8]
2. అష్షాఫయీ రహిమహుల్లాహ్ ఇలా తెలిపారు :
   "నాఫీ హదీథు సూచిస్తున్నదేమిటంటే, మహోన్నతుడైన అల్లాహ్ యొక్క దివ్యగ్రంథాన్ని అనుసరించి, రసూలుల్లాహ్ ముస్లింలపై దానిని తప్పని సరి చేసారు. ఎందుకంటే అల్లాహ్ జకాతును ముస్లిం కొరకు పరిశుద్ధ పరిచేదిగా చేసాడు మరియు పరిశుద్ధత కేవలం ముస్లింల కొరకు మాత్రమే."[9]

---

[7]. అల్ ముగ్నీ, ౩వ భాగం, ఫాసల్ వఖ్త్ ఉజూబ్ జకాతుల్ ఫిత్ర్.

[8] . అల్ బుఖారీ, ౧౪౦౭.

[9] . అల్ ఉమ్మ్, ౨వ భాగం, బాబ్ జకాతుల్ ఫిత్ర్.

3. చెల్లించగలిగే స్తోమత ఉన్న వారిపై ఇది తప్పనిసరి. అష్షాఫయీ ఇలా తెలిపారు:

"షవ్వాల్ నెల ఆరంభమైనపుడు, తనకు మరియు తను పోషిస్తున్న వారికి ఆరోజున సరిపోయే పరిమాణంలో అన్నపానీయాలు అతని వద్ద ఉంటే, అతను తన తరుఫున మరియు తను పోషిస్తున్న వారి తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం తప్పక చేయాలి. ఒకవేళ అతని వద్ద తను పోషిస్తున్నవారిలో కొందరి తరుఫున చెల్లించగలిగి నంత మాత్రమే ఉంటే, అతను ఆ కొందరి తరుఫున దానిని తప్పని సరిగా దానం చేయాలి. ఒకవేళ అతని వద్ద తనకు మరియు తను పోషిస్తున్న వారికి చాలినంత మాత్రమే ఉంటే (తన తరుఫున మరియు తను పోషిస్తున్న వారి తరుఫున జకాతుల్ ఫిత్ర్ చెల్లించగలిగే స్తోమత అతనికి లేకపోతే), తన తరుఫున మరియు తను పోషిస్తున్న వారి తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయటం అతనిపై తప్పని సరి కాదు."[10]

4. అన్నవావీ రహిమహుల్లాహ్ ఇలా తెలిపారు :

"ఆర్థిక ఇబ్బందులలో ఉన్నవారు (జకాతుల్ ఫిత్ర్) దానం చేయవలసిన అవసరం లేదు; పండితుల మధ్య దీని గురించి ఎలాంటి భేదాభిప్రాయం లేదు... చెల్లించ గలిగే స్తోమత ఉందా లేదా అనేదాని నుండి, అది అతనిపై తప్పని సరియా కాదా అనేది

[10]. అల్ ఉమ్మ్, 2వ భాగం, బాబ్ జకాతుల్ ఫిత్ర్.

నిర్ధారించబడుతుంది. (తగిన స్తోమత ఉన్నవారంటే) ఎవరైతే స్వయంగా తనకు మరియు తను పోషిస్తున్న వారికీ పండుగ దిన రాత్రింబవళ్ళలో అవసరమైన దాని కంటే అదనంగా ఒక సాఅ కలిగి ఉన్నారో (అలాంటి వారు ఆర్థిక ఇబ్బందిలో లేనట్లే). అదనంగా ఏమీ లేకుండా, తన అవసరాలకు చాలినంత మాత్రమే ఉన్నవారు ఆర్థిక ఇబ్బందిలో ఉన్నట్లే, కాబట్టి వారు ఈ స్థితిలో ఏమీ చెల్లించనక్కరలేదు."[11]

5. ఒక ముస్లిం, స్వయంగా తన తరుఫున మరియు తను ఎవరి పైనైతే ఖర్చు పెడుతున్నాడో, ఒకవేళ అలాంటి వారు స్వయంగా చెల్లించలేని స్థితిలో ఉంటే, వారి తరుఫున కూడా అంటే భార్యాబిడ్డల మరియు బంధువుల తరుఫున కూడా తప్పని సరిగా దానం చేయాలి. ఒకవేళ వారు తమకు తామే చెల్లించగలిగే స్థితిలో ఉంటే, వారు స్వయంగా దానం చేయటం ఉత్తమం, ఎందుకంటే ధర్మాదేశం మొదట వారినే సంబోధిస్తున్నది. ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా ఇలా ఉల్లేఖించారు, "బానిస లేక స్వతంత్రుడు, మగ లేక ఆడ, బాలుడు లేక ముసలివాడు అయిన ప్రతి ముస్లింపై రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, ఒక సాఅ ఖర్జూర పళ్ళు లేక ఒక సాఅ బార్లీ గింజల జకాతుల్ ఫిత్ర్ దానం చేయటాన్ని తప్పని సరి చేసారు. మరియు పండుగ

---

[11]. అల్ మజ్మూఅ, ౬వ భాగం, షురూత్ ఉజూబ్ సదఖాతుల్ ఫిత్ర్.

నమాజు కొరకు ప్రజలు బయటకు వెళ్ళే ముందే దానం చేయమని ఆదేశించారు.”

అష్షాఫయీ రహిమహుల్లాహ్ ఇలా తెలిపారు :

“మతిస్థిమితం లేని వారి సంరక్షకులు మరియు చిన్నపిల్లల సంరక్షకులు, వారి తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయాలి మరియు వారు (మతిస్థిమితం లేని వారు మరియు చిన్నపిల్లలు) బాధ్యత వహిస్తున్న వారి తరుఫున కూడా ... ఒకవేళ వారలా బాధ్యత వహిస్తున్న వారిలో ముస్లిమేతరులు ఎవరైనా ఉంటే, ఆ ముస్లిమేతరుని కొరకు దానం చేయనక్కరలేదు. ఎందుకంటే, జకాతు దానం ద్వారా అతను పరిశుద్ధుడు కాలేడు.”[12]

అల్ ముహద్దబ్ రచయిత ఇలా తెలిపారు :

“గ్రంథ రచయిత (అల్లాహ్ ఆయనపై కరుణించుగాక) ఇలా పేర్కొన్నారు: ‘ఒకవేళ ఎవరైనా స్వయంగా తన తరుఫున మరియు తను పోషిస్తున్న వారి తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసి ఉంటే, ఒకవేళ వారు ముస్లిములై ఉంటే మరియు ఒకవేళ అతని వద్ద వారిపై ఖర్చు చేసేందుకు అవసరమైన దానికంటే అదనంగా ఉంటే, అతని తల్లిదండ్రులు మరియు తాతముత్తాతలు ... మొదలైన వారు తమ మనుమలు మరియు మునిమనుమలు మొదలైనవారి తరుఫున

[12] . అల్ ఉమ్మ్, ౨వ భాగం, బాబ్ జకాతుల్ ఫిత్ర్.

జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసుంటే, అపుడు ఆ సంతానం తమ తల్లిదండ్రుల, తాతముత్తాతలు మొదలైన వారి తరుఫున జకాతు దానం చేయాలి – ఒకవేళ వారు ఆ పెద్దల పోషణఖర్చులకు బాధ్యులైనట్లయితే.’’’[13]

ఒక వ్యక్తి స్వయంగా తన తరుఫున మరియు తన భార్య తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయాలి – భార్య వద్ద ఆమె స్వంతం ధనం ఉన్నా సరే – మరియు అతని సంతానం మరియు తల్లిదండ్రుల తరుఫున – ఒకవేళ వారు బీదవారైతే, తన కూతురి తరుఫున ఒకవేళ ఆమె నిఖాహ్ మాత్రమే అయి, ఇంకా శోభనం జరగక పోతే. ఒకవేళ అతని కుమారుడు ధనవంతుడైతే, అతని తరుఫును తండ్రి జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసినవసరం లేదు. విడాకులు ఇవ్వబడి, ఇంకా పూర్తిగా విడాకులు జరగని పక్షంలో (౧వ లేక ౨వ తలాఖ్ యొక్క ఇద్దా కాలం పూర్తి కాని పక్షంలో) ఆ భార్య తరుఫున ఆమె భర్త జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసి ఉంటుంది. అయితే తిరుగుబాటు చేసిన భార్య తరుఫున లేక అంతిమ విడాకుల ప్రక్రియ పూర్తయిన భార్య తరుఫున చెల్లించ నవసరం లేదు. కాదు. కుమారుడు, బీదవాడైన తన తండ్రి భార్య తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసిన అవసరం లేదు,

---

[13] . అల్ మజ్మూఅ, ౬వ భాగం.

ఎందుకంటే ఆమెపై ఖర్చు చేయవలసిన బాధ్యత ఆ కుమారునిపై లేదు.

(జకాతుల్ ఫిత్ర్ చెల్లిస్తున్నపుడు), మొదటగా అతను తన అతి దగ్గరి వారి నుండి ఆరంభించవలెను, అంటే మొదటగా అతను స్వయంగా తన కోసం దానం చేయాలి, తర్వాత తన భార్య కోసం, ఆ తర్వాత పిల్లల కోసం, ఆ తర్వాత మిగిలిన బంధువుల కోసం  వారసత్వ నియమాలను అనుసరిస్తూ వారి బంధుత్వ సామీప్యాన్ని బట్టి.

అష్షాఫయీ రహిమహుల్లాహ్ ఇలా పలికారు :

“జకాతుల్ ఫిత్ర్ తప్పని సరిగా దానం చేయాలని నేను చెప్పాలనుకునేది ఎవరి గురించి అంటే – అతనికి జన్మించిన పసిబిడ్డ తరుఫున, అతని ఆధీనంలో ఉన్న బానిస తరుఫున, ఒకవేళ ఎవరైనా అతనిపై ఆధారపడి ఉంటే అలాంటి వారి తరుఫున, రమదాన్ చివరి రోజు సూర్యుడు అస్తమించి, షవ్వాల్ నెలవంక కనబడిన తర్వాత ఏ సమయంలోనైనా, అతను వారి తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయ వలసి ఉంటుంది.”[14]

---

[14] . అల్ ఉమ్మ్, బాబ్ జకాతుల్ ఫిత్ర్ అల్ థాని

ఇంకా తల్లి గర్భంలోనే ఉన్న శిశువు తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం ఇవ్వవలసిన అవసరం లేదు. కానీ, ఒకవేళ స్వచ్ఛందంగా ఎవరైనా ఇస్తే, దానిలో ఎలాంటి తప్పూ లేదు.

విధిగా జకాతుల్ ఫిత్ర్ ఇవ్వవలసి ఉన్న వ్యక్తి ఎవరైనా దానిని ఇవ్వక ముందే మరణిస్తే, వారసత్వ ధనం నుండి ఆ దానం చేయవలసి ఉంటుంది. అలాగే ఒకవేళ అతనిని పోషిస్తున్న వ్యక్తి చనిపోయినా సరే, ఈ విధి దానం తప్పక చేయవలసి ఉంటుంది.[15]

ఒకవేళ ఒక బానిసతో రోజువారీ లేక నెలవారీ భత్యం చెల్లించే ఒప్పందం చేసి ఉంటే, అతని యజమాని ఆ బానిస తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే, అతనిపుడు భత్యం కొరకు పనిచేసే నౌకరు మరియు నౌకరుపై ఖర్చు చేయవలసిన బాధ్యత అతని యజమానిపై లేదు.[16]

అనాథ తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం చేసే విషయానికి వస్తే, ఇమాం మాలిక్ రహిమహుల్లాహ్ ఇలా తెలిపారు : "వారి కొంత సంపద తన ఆధీనంలో ఉండటం వలన, పసివారైనా సరే, ఆ అనాథల తరుఫున వారి సంరక్షకుడు జకాతుల్ ఫిత్ర్ దానం చేయవలసి ఉంటుంది."[17]

---

[15]. అల్ ముగ్నీ, ౩వ భాగం.

[16] . అల్ మౌసూఅహ్ , ౨౩/339

[17] . అల్ ముదవ్వనహ్, ౧వ భాగం.

## జకాతుల్ ఫిత్ర్ రూపంలో దానం చేయవలసినది ఎంత ?

క్రింది హదీథు ప్రకారం, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వాడిన సాఅ కొలతను అనుసరించి, జకాతుల్ ఫిత్ర్ దానమివ్వవలసిన మొత్తం □ 'ఒక సాఅ ఆహారం (గింజలు)'. అబూ సయీద్ అల్ ఖుద్రీ రదియల్లాహు అన్హు ఉల్లేఖన: "ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో మేము దానిని ఒక సాఅ ఆహారం (గింజలు) రూపంలో ఇచ్చేవారము... ”[18]

ఆహార గింజలను బట్టి ఒక సాఅ బరువు (సాఅ అనేది ఘనపరిమాణపు కొలత) మారుతూ ఉంటుంది. కాబట్టి, జకాతుల్ ఫిత్ర్ దానం చేసేటపుడు, తను దానం చేస్తున్న ఆహార గింజల కొలత, ఒక సాఅ ఘనపరిమాణానికి సమానమైనదిగా ఉండేలా జాగ్రత్త పడవలెను. ఒక సాఅ అనేది దాదాపు మూడు కిలోల బియ్యానికి సమానం.

## జకాతుల్ ఫిత్ర్ దానంలో ఇవ్వగలిగే వివిధ ఆహారం (గింజలు)

ఖర్జూరపు పళ్ళు, గోధుమలు, బియ్యం లేక మానవులు తినే ఇతర ఆహార గింజలు మొదలైన మానవ వినియోగానికి పనికి వచ్చే ఆహారాన్ని జకాతుల్ ఫిత్ర్ రూపంలో దానం చేయవలసి ఉంటుంది. అల్

[18] . అల్ బుఖారీ ౧౪౧౨

సహీహైన్ లో ఇబ్నె ఉమర్ రదియల్లాహు అన్హుమా నుండి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒక సాఅ ఖర్జూరపు పళ్ళు లేక ఒక సాఅ బార్లీ గింజలను ముస్లింలు బానిసలైనా లేక స్వతంత్రంగా ఉన్నా, మగవారైనా లేక ఆడవారైనా, జకాతుల్ ఫిత్ర్ రూపంలో తప్పని సరిగా దానం చేయాలని ఆదేశించారు. (ఆ కాలంలోని ప్రజలు బార్లీ గింజలను కూడా ఆహారంగా వాడేవారు)[19]. అబూ సయీద్ అల్ ఖుద్రీ రదియల్లాహు అన్హు ఇలా తెలిపారు:

“రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో, ఫిత్ర్ రోజున మేము ఒక సాఅ ఆహారాన్ని దానం చేసేవారం.” అబూ సయీద్ (రదియల్లాహు అన్హు) ఇలా పలికారు, “మరియు మా ఆహారం – బార్లీ, ఎండిన ద్రాక్షపళ్ళు, ఎక్విట్ (ఎండబెట్టిన పెరుగు) మరియు ఖర్జూరపు పళ్ళు”[20]

స్థానికంగా వాడే అక్కడి ప్రధాన పంట గింజలు అంటే గోధుమ, బియ్యం, ఖర్జూరపు పళ్ళు లేక పప్పుదినుసులు మొదలైన వాటినే జకాతుల్ ఫిత్ర్ దానంలో ఇవ్వవచ్చు.

అష్షాఫయీ రహిమహుల్లాహ్ ఇలా తెలిపారు:

---

19. అల్ బుఖారీ ౧౪౦౮

20. అల్ బుఖారీ ౧౪౦౮

“ఒకవేళ మొక్కజొన్నలు, చిరుధాన్యాలు(దుఖ్న్), సన్నటి పొట్టు గల బార్లీ (సల్ట్), బియ్యం లేక ఏదైనా ఇతర ఆహార గింజలు మొదలైనవి దైనిపైపైసైతే జకాతు విధిగా నిర్ణయించబడిందో, అది అక్కడి ప్రజల ముఖ్యాహారమైతే, దానిని జకాతుల్ ఫిత్ర్ దానంలో ఇవ్వ వచ్చు.”[21]

అన్నవావీ రహిమహుల్లాహ్ ఇలా తెలిపారు,

“మా సహచరులు (అష్షాఫయీ మధ్హబ్ కు చెందిన తోటి పండితులు) ఇలా పలికారు: ‘ఏదైనా ఆహారాన్ని జకాతుల్ ఫిత్ర్ గా దానం ఇవ్వటానికి షరతు ఏమిటంటే, అది 1/10వ వంతు జకాతు (అంటే ఆహార ధాన్యాలపై మరియు పళ్ళుఫలాల జకాతు) చెల్లించబడిన ఆహార పదార్థాలలోనిదై ఉండాలి. అది కాకుండా మరేదీ జకాతుల్ ఫిత్ర్ దానం కొరకు అంగీకరించబడదు - అఖిత్ (ఎండబెట్టిన పెరుగు), జున్నుగడ్డ మరియు పాలు తప్ప.’ ”

అల్ మావర్ది ఇలా పలికారు:

“ద్వీపాలపై నివసించే కొందరి ముఖ్యోత్పత్తి చేపలు లేక గుడ్లు అయినా సరే - ఇదే అసలు స్థితి; ఇవి (జకాతుల్ ఫిత్ర్ గా దానం చేసేందుకు) అంగీకరించబడదు మరియు (దీని గురించి పండితుల మధ్య) ఎలాంటి భేదాభిప్రాయం లేదు. ఇక మాంసం గురించైతే, సరైన అభిప్రాయాన్ని

---

[21] . అష్షాఫయీ, అల్ ఉమ్మ్, ౨వ భాగం, బాబ్ అల్ రజుల్ యక్తలిఫు ఖూతుహు.

అష్షాఫయీ తెలిపారు. అంతేగాక దానిని అల్ ముసన్నఫ్ మరియు ఆయన సహచరులు ధృవీకరించారు, పూర్తిగా ఇలా ఉల్లేఖించారు కూడా: ఇది (జకాతుల్ ఫిత్ర్ గా) అంగీకరించబడదు మరియు దీనిపై అందరి (పండితులందరి) అభిప్రాయం ఒక్కటే... మా సహచరులు ఇలా పలికారు: 'ప్రజల ముఖ్యోత్పత్తి అయినా సరే, 1/10 వ వంతు జకాతు ఇవ్వబడని అంటే అంజీరు పండు వంటి పళ్ళుఫలాల విషయంలో కూడా ఇదే నియమం వర్తిస్తుంది. సంగతి కూడా ఇదే. (జకాతుల్ ఫిత్ర్ గా) ఇవి అస్సలు అంగీకరించబడవు.'[22]

ఇబ్నె అల్ ఖయ్యిమ్ రహిమహుల్లాహ్ ఇలా పలికారు:

" ఒకవేళ 'అది అక్కడి ముఖ్యోత్పత్తి అయినా, అవకపోయినా ప్రతి చోటా మీరు తప్పక ఒక సాఅ ఖర్జూరపు పళ్ళు మాత్రమే(జకాతుల్ ఫిత్ర్ గా) ఇవ్వాలని' చెప్పబడటమనేది, చర్చించ వలసిన ఒక వివాదాస్పద అంశమై పోయేది. 'ఇది తప్పని సరి' అని పలికే కొందరు ప్రజలు కూడా ఉన్నారు. అయితే జకాతుల్ ఫిత్ర్ దానం ఇవ్వటం కొరకు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పేర్కొన్న ఐదు రకాల ఆహారాలను అనుసరించి 'ఆయా దేశాలలోని ముఖ్యోత్పత్తిలో నుండే ఒక సాఅ ఇవ్వటమనేది విధిగా చేయబడిందని' చెప్పే ఇతరులూ ఉన్నారు. ఇదే సరైన అభిప్రాయం మరియు షరిఅహ్ నియమాలకు

[22] . అల్ మజ్మూఅ, ౬వ భాగం, అల్ వాజిబ్ ఫీ జకాతుల్ ఫిత్ర్.

దగ్గరైంది. ఎందుకంటే చేపలు లేక బియ్యం లేక గింజలు ముఖ్యోత్పత్తిగా ఉన్న ప్రజలను, మీరు తప్పని సరిగా ఖర్జూరపు పళ్ళే ఇవ్వాలని ఎలా చెప్పగలరు? ... మరియు శక్తికి మూలం అల్లాహ్ యే."[23]

గోధుమలతో తయారు చేయబడిన పస్తా (మక్రోనీ) ఇవ్వటం అనుమతించబడింది, కానీ దాని బరువు తప్పకుండా ఒక సాఅ గోధుమల బరువుతో సమానంగా ఉండేట్లు జాగ్రత్త పడాలి.

ఇక ధనం రూపంలో జకాతుల్ ఫిత్ర్ ఇవ్వటం గురించి, ఇది అస్సలు అనుమతించబడలేదు. ఎందుకంటే ఆహారం రూపంలో ఇవ్వమని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పలికి ఉన్నారే గాని ధనం రూపంలో కాదు. ఆహారం రూపంలో ఇవ్వాలని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. కాబట్టి, వేరే రూపంలో ఇవ్వడమనేది అనుమతించబడలేదు మరియు బహిరంగంగా ఇవ్వాలని ఇస్లాం యొక్క అభిలాష – రహస్యంగా కాదు. సహాబాలు ఆహారం రూపంలో జకాతుల్ ఫిత్ర్ దానం ఇచ్చారు మరియు మనం వారిని అనుసరించాలే గాని, నూతన పోకడలు కల్పించరాదు. ఆహార ధాన్యాల రూపంలో జకాతుల్ ఫిత్ర్ దానం ఇవ్వడంలో దానిని ఒక సాఅ ప్రమాణానికి అనుగుణంగా నియంత్రించవచ్చు, ఒకవేళ దానిని ధనం రూపంలో ఇవ్వాలనుకుంటే, దానిని ఆ విధంగా నియంత్రించలేము: దేని ధర ఆధారంగా అది లెక్కించాలి మరియు

[23]. ఇలామ్ అల్ మువాఖ్ఖియీన్, ౨వ భాగం, అల్ ఖియాస్.

ఇవ్వాలి? స్థానికి ముఖ్యోత్పత్తి రూపంలో అది ఇవ్వడంలో స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఉదాహరణకు – ధరలు పెరగటం వలన వ్యాపారస్థులు కొన్ని రకాల ఆహార పదార్థాలను దాచి పెట్టినపుడు లేక యుద్ధాల జరుగుతున్నపుడు మరియు ద్రవ్యోల్బణ సమయంలో. "కానీ, బీదప్రజల కొరకు ధనం చాలా ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఎందుకంటే వారు ఆ ధనంతో తమకు అవసరమైన వాటిని కొనుక్కోగలరు మరియు ఆహారం కాకుండా వారికి వేరేది ఏదైనా అవసరమై ఉండటం వలన, బీదవారు తమకు దానం ఇవ్వబడిన ఆహార ధాన్యాలను తక్కువ ధరకు అమ్మి, కొంత ధనాన్ని కోల్పోతారని" ఎవరైనా అనవచ్చు. దీనికి సమాధానం ఏమిటంటే ఇల్లు, బట్టలు మొదలైన ఇతర అవసరాలు తీరటానికి బీద ప్రజల కొరకు బైతుల్ మాల్ లోని జకాతు ధనం నుండి చెల్లింపబడటం, సాధారణ దానాలు మరియు విరాళాలు వంటి వేరే మార్గాలున్నాయి. మనం సరైన ఇస్లామీయ దృష్టికోణంలో మనం ఆ యా విషయాలను చూడాలి మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మార్గదర్శత్వాన్ని విడువకుండా గట్టిగా పట్టుకోవాలి – ఒక సాఅ ఆహార ధాన్యాలను బీదవారికి దానం చేయటం మీపై తప్పనిసరి చేయబడిందని ఆయన మనకు తెలిపారు. ఒకవేళ మనం ఆహార పదార్థాలను ఒక బీదవానికి దానం చేసినట్లయితే, అతను దానిని తింటాడు మరియు వెంటనే లేదా తర్వాత దాని నుండి అతను లాభం పొందుతాడు. ఎందుకంటే అది అతను నిత్యం వాడే ఆహార పదార్థాలలోనిది.

దీని ఆధారంగా, ఎవరైనా వ్యక్తికి అతని అప్పులు తీర్చుకోవడానికి లేదా ఒక రోగి వైద్యానికి లేదా అక్కర గల ఒక విద్యార్థి ఫీజు చెల్లించడానికి జకాతుల్ ఫిత్ర్ ధనాన్ని ఖర్చు పెట్టే అనుమతి లేదు. పైన తెలిపిన విధంగా, ఇలాంటి అవసరాల కొరకు వేరే దారులున్నాయి.

## జకాతుల్ ఫిత్ర్ దానం చేసే సమయం ఏది ?

క్రింది హదీథులో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినట్లుగా, ఈద్ నమాజు కంటే ముందే జకాతుల్ ఫిత్ర్ దానం చేయాలి.

"ప్రజలు (ఈద్) నమాజు కొరకు బయలు దేరక ముందే ఇది ఇవ్వాలని ఆదేశించబడింది.. "[24]

జకాతుల్ ఫిత్ర్ దానం కొరకు ఉత్తమ సమయం(ముస్తహబ్) మరియు అనుమతించబడిన సమయాలు ఉన్నాయి.

ఉత్తమ సమయం (ముస్తహబ్) సమయం ఏదంటే – ఈద్ రోజు, దీనికి ఆధారం పైన పేర్కొనబడిన హదీథు. అందు వలన ఈదుల్ ఫిత్ర్ దినమున ఈద్ నమాజు కొంచెం ఆలస్యంగా చేయటం సున్నతు. దీని

---

[24]. అల్ బుఖారీ ౧౪౦౭

వలన జకాతుల్ ఫిత్ర్ దానం ఇవ్వటానికి మరియు ఏదైననా ఉపాహారం తినటానికి తగినంత సమయం లభిస్తుంది. అయితే ఈద్ అల్ అద్హా (బక్రీదు) సమయంలో ఈద్ నమాజు త్వరగా చేయటం సున్నతు. దీని వలన ప్రజలు తమ ఖుర్బానీ త్వరగా చేసి, దానిలో నుండి భుజించటానికి వీలు కలుగుతుంది. సహీహ్ అల్ బుఖారీలో, నాఫీ నుండి ఇలా నమోదు చేయబడింది:

“ఇబ్నె ఉమర్ పిల్లల మరియు ముసలివాళ్ళ తరుఫున (జకాతుల్ ఫిత్ర్) ఇచ్చేవారు. అంతేగాక నా కొడుకుల తరుఫున కూడా ఆయన ఇచ్చేవారు. ఎవరైతే తీసుకుంటున్నారో, వారికి ఆయన ఇచ్చేవారు. మరియు అల్ ఫిత్ర్ (ఈద్ రోజు) కంటే ఒకటి లేక రెండు రోజుల ముందు ఇవ్వబడేది.”

‘ఎవరైతే తీసుకుంటున్నారో’ అనేది సదఖాతుల్ ఫిత్ర్ ను సేకరించబడానికి ఇమాంచే నియమించబడిన వారిని సూచిస్తుంది.

నాఫీ ఇలా పలికారు:

“అల్ ఫిత్ర్ (ఈద్ రోజు) కంటే రెండు లేక మూడు దినాలకు ముందే ఇబ్నె ఉమర్ జకాతుల్ ఫిత్ర్ ను దానిని సేకరించే వారి వద్దకు పంపేవారు”[25]

---

[25] . అల్ ముదవ్వనహ్, ౧వ భాగం, బాబ్ తజీల్ అల్ జకాహ్ ఖబ్లా హులూలిహ్.

సలాతుల్ ఈద్ వరకు దానిని ఆలస్యం చేయడం అయిష్టకరమైన చర్య (మక్రూహ్); కొందరు పండితులు క్రింది హదీథు ఆధారంగా ‘అలా చేయటం హరాం అని మరియు అది ఖదా (విధి ఆచరణను దాని సమయంలో చేయకపోవటం) క్రిందికి వస్తుందని’ అన్నారు,

“ఎవరైతే (ఈదుల్ ఫిత్ర్) నమాజు కంటే ముందే చెల్లించారో, అది స్వీకరించబడిన జకాతు (అల్ ఫిత్ర్) అవుతుంది మరియు ఎవరైతే (ఈదుల్ ఫిత్ర్) నమాజు తర్వాత చెల్లించారో, అది కేవలం ఒక మామూలు దానమై పోతుంది.”[26]

ఔన్ అల్ మఆబూద్ షరహ్ అబీ దాఊద్ లో ఇలా తెలుపబడింది:

“ఎవరైతే జకాతుల్ ఫిత్ర్ ను నమాజు తర్వాత ఇస్తారో, అలాంటి వారు నిజానికి జకాతుల్ ఫిత్ర్ ఇవ్వని వారితో సమానమేనని స్పష్టమవుతుంది, ఎందుకంటే వారి మధ్య ఉమ్మడిగా ఉన్న వాస్తవం ఏమిటంటే వారు ఈ తప్పనిసరి దానం చేయలేదు. సలాతుల్ ఈద్ కంటే ముందే జకాతుల్ ఫిత్ర్ దానం చేయడమనేది కేవలం ముస్తహబ్ అని చాలా మంది పండితులు అభిప్రాయపడుతూ ఉంటారు మరియు దానిని ఈదుల్ ఫిత్ర్ రోజు అంతం గాక ముందు, ఏ సమయంలో ఇచ్చినా స్వీకరించబడుతుందని ధృవీకరిస్తుంటారు. కానీ, పైహదీథు ఈ

---

[26] . అబూ దాఊద్, ౧౩౭౧.

అభిప్రాయాన్ని ఖండిస్తున్నది. ఈద్ దినం అంతమయ్యే వరకు దానిని ఆలస్యం చేయడం గురించి, ఇబ్నె రస్లాన్ ఇలా పలికారు: "పండితుల ఏకాభిప్రాయం ఆధారంగా ఇది (ఇలా ఆలస్యం చేయటం) హరాం. ఎందుకంటే ఇది జకాహ్, కాబట్టి ఎవరైతే దీనిని ఆలస్యం (చెల్లించటంలో) చేస్తున్నారో, నమాజు ఆలస్యం చేస్తే ఎలా పాపం చేసిన వారవుతారో, అదే విధంగా అలాంటి వారు పాపం చేస్తున్నట్లే."

కాబట్టి, సముచితమైన కారణం లేకుండా అలా ఆలస్యం చేయటం హరాం, ఎందుకంటే అది 'సంతోషకరమైన దినమున బీదప్రజలను అడుక్కోవటం నుండి కాపాడటమనే' దాని అసలు ఉద్దేశ్యాన్ని పూర్తి చేయటంలో సఫలమవటం లేదు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి తగిన కారణం లేకుండా ఆలస్యం చేస్తే, అతను పాపం చేసినట్లు పరిగణించబడుతున్నా, అతను దానిని పూర్తి చేయవలసి ఉంది.

జకాతుల్ ఫిత్ర్ ను ఈద్ నమాజు కంటే ముందే సరైన సమయంలో దాని హక్కుదారులకు అందజేయ వలెను లేదా దానిని సేకరించడానికి నియమించబడిన వారికి అందజేయ వలెను. ఒకవేళ ఎవరైనా వ్యక్తి దానిని అందజేయాలని తలిచిన ఒక నిర్ణీత వ్యక్తిని కనుగొన లేకపోతే లేదా అతని తరుఫున ఎవరైనా ధర్మకర్త స్వీకరించేందుకు అందుబాటులో లేకపోతే మరియు సమయం మించిపోతుందేమోనని అతను భయపడుతున్నట్లయితే, అతను దానిని మరో తగిన హక్కుదారునికి అందజేయాలి. అంతే గాని సమయం మించిపోయే

వరకు ఆలస్యం చేయకూడదు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి తన జకాతుల్ ఫిత్ర్ ను ఒక నిర్ణీత హక్కుదారినికి మాత్రమే ఇవ్వాలని తలిచినా, సరైన సమయానికి అతను అందుబాటులో లేకపోవచ్చని అతను భయపడితే, అతని తరుఫున దానిని స్వయంగా తన నుండి తీసుకోవటానికి ఎవరినైనా నియమించమని అతను ఆ పేదవానితో చెప్పాలి. ఆ తర్వాత సరైన సమయం సమీపించినపుడు, దానిని అతను ఒక సంచిలో లేక దేనిలోనైనా అతని వద్దకు చేర్చాలి లేదా దానిని అతని అమానతుగా తన వద్ద ఉంచుకుని, అతను కనబడే వరకు నిరీక్షించాలి.

ఒకవేళ తన తరుఫున జకాతు చెల్లించమని అతను ఎవరినైనా నియమిస్తే, అతను నియమించిన వ్యక్తి అతని ఆదేశాలను పూర్తిగా అమలు చేసాడనే విషయం నిర్ధారించబడే వరకు అతనే బాధ్యుడు.[27]

## జకాతుల్ ఫిత్ర్ దానాన్ని ఎవరికి అందజేయాలి ?

జకాతుల్ మాల్ ఇవ్వటానికి అర్హులైన ఎనిమిది వర్గాలకు జకాతుల్ ఫిత్ర్ దానం అందజేయవచ్చు. మెజారిటీ పండితుల అభిప్రాయమిదే. మలికీ పండితుల అభిప్రాయం, ఇమాం అహ్మద్ అభిప్రాయాలలోని ఒక

[27]. మజాలిస్ షహార్ రమదాన్: అహ్కామ్ జకాతుల్ ఫిత్ర్, షేఖ్ ఇబ్నె ఉథైమీన్.

అభిప్రాయం మరియు ఇబ్నె తైమియహ్ అభిప్రాయం దానిని కేవలం బీదవారికి మరియు అక్కరగలవారికి మాత్రమే అందజేయవలెను.

1. ఇమాం అష్షాఫయీ ఇలా పలికారు:
   "జకాతుల్ ఫిత్ర్ ను జకాతుల్ మాల్ ఇవ్వబడే వర్గాలలో విభజించాలి. అంతేగాని దానిని మరెక్కడా ఖర్చు పెట్టరాదు. అది బీదలు మరియు అక్కరగలవారు, తమ యజమానితో తమ స్వేచ్ఛను కొనుక్కోవటానికి ఒప్పందం చేసుకున్న బానిసలు, అప్పులలో కూరుకున్నవాళ్ళు, అల్లాహ్ మార్గంలో పోరాడుతున్న వారు మరియు బాటసారుల మధ్య పంచబడాలి."[28]

2. ఇబ్నె అబ్బాస్ రదియల్లాహ్ అన్హుమా ఉల్లేఖన ప్రకారం ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ముఆద్ రదియల్లాహు అన్హుకు బోధించిన "తమ సంపదలో నుండి తీసి, బీదవారిలో పంచి పెట్టే సదఖ ఇవ్వవలసి ఉందని వారికి చెప్పు" అనే హదీథును పేర్కొన్న తర్వాత, అన్నవావీ రహిమహుల్లాహ్ ఇలా అన్నారు,

[28] . అల్ ఉమ్మ్, బాబ్ దాయహ్ జకాతుల్ ఫిత్ర్ ఖబ్ల ఖస్మిహా

“జకాహ్ లోని ఏ భాగాన్నైనా ఒక ముస్లిమేతరునికి ఇవ్వటం అనుమతించబడలేదు – అది జకాతుల్ ఫిత్ర్ అయినా లేక జకాతుల్ మాల్ అయినా .... మాలిక్, అల్ లైథ్, అహ్మద్ మరియు అబూ థౌర్ లు ఇలా అన్నారు, ‘వారు (ముస్లిమేతరులు) ఇవ్వబడకూడదు’ ”

అప్పులలో మునిగిపోయిన, తమ జీతం డబ్బులు నెలాఖరు వరకు సరిపోని బీద ప్రజలకు వారి అక్కరల స్థాయిని బట్టి జకాహ్ దానం ఇవ్వాలి.

జకాతుల్ ఫిత్ర్ దానం ఇచ్చేవారు, తను దానం ఇచ్చిన వాని నుండి తిరిగి దానిని కొనుక్కోవటమనేది అనుమతించడలేదు.[29]

## చెల్లించటం మరియు పంచటం

1. జకాతుల్ ఫిత్ర్ దానం చేసేవారు స్వయంగా దానిని బీదలకు పంచిపెట్టడం ఉత్తమం. (అష్షాఫయీ రహిమహుల్లాహ్ ఇలా పలికారు): “దానిని సేకరించేవారికి ఇవ్వటం కంటే నేనే స్వయంగా జకాతుల్ ఫిత్ర్ దానం పంచి పెట్టడం నాకు ఇష్టం.”
2. అన్నవావీ రహిమహుల్లాహ్ ఇలా పలికారు: “తన అల్ ముక్తసర్ లో అష్షాఫయీ ఇలా పలికారు: ‘జకాతుల్ మాల్

[29] . ఫతావా అల్ షేఖ్ ఇబ్నె ఉథైమీన్.

దానాన్ని పంచి పెట్టే వర్గాలలో జకాతుల్ ఫిత్ర్ దానాన్ని పంచి పెట్టాలి. వారిని పోషించే బాధ్యత నాపై లేనటువంటి బంధువులకు దానిని అందజేయటం నాకిష్టం.' ఇంకా ఆయనిలా అన్నారు: 'ఒకవేళ దానిని సేకరించే వారికి అందజేయటాన్ని ఎవరైనా ఇష్టపడితే, ఇన్ షాఅ అల్లాహ్ అది మంచిదే. ... కానీ, స్వయంగా దానిని పంచి పెట్టడం అతని కొరకు ఉత్తమం. ..

ఒకవేళ అతను దానిని ముస్లింల నాయకునికి, దానిని సేకరించేవారికి లేక ప్రజల జకాతుల్ ఫిత్ర్ ను జమ చేస్తున్న వానికి ఇచ్చినా లేక ఇవ్వటానికి అనుమతించినా, అది సరైనదే. కానీ, స్వయంగా దానిని బీదలలో పంచి పెట్టడమనేది వీటన్నింటి కంటే ఉత్తమం.' "[30]

3. హక్కుదారులకు దానిని అందజేయమని ఎవరైనా నమ్మకస్తుడిని నియమించడానికి అనుమతి ఉంది. అయితే, ఒకవేళ అతను నమ్మకస్తుడు కాకపోతే, అలా చేయడానికి అనుమతి లేదు. అబ్దుల్లాహ్ ఇబ్నె అల్ ముఅమ్మల్ ఇలా అన్నారు: "ఇబ్నె అబీ ములైకహ్ తో 'మస్జిదులో నా

---

[30] . అల్ మజ్మూఅ, ౬వ భాగం

జకాతుల్ ఫిత్ర్ దానాన్ని విడిచి పెట్టమని నాతో ఫలానా ఫలానా వ్యక్తి చెప్పారు' అని ఒక వ్యక్తి నుండి పలకడాన్ని నేను విన్నాను. బదులుగా ఇబ్నె అబీ ములైకహ్ ఇలా అన్నారు, 'అతను (ఫలానా ఫలానా వ్యక్తి) దేని గురించి మాట్లాడుతున్నాడో, అతనికి తెలియదు. నీవు వెళ్ళు మరియు (స్వయంగా పేదలలో) పంచిపెట్టు. అలా చేయకపోతే, ఇబ్నె హిషామ్ (మస్జిదులో దానిని సేకరిస్తున్న అధికారి) దానిని తన రక్షకభటులలో తాను తలిచిన వారికి ఇస్తాడు.' (అంటే దాని హక్కుదారులకు అతను అందజేస్తాడు)"[31]

ప్రజల సమూహంలో ఒక సాఅ ను పంచిపెట్టడం లేక ఒకే వ్యక్తికి అనేక సాఅలు ఇవ్వడం అనుమతించబడిందని అఇమాం అహ్మద్ రహిమహుల్లాహ్ పలికారు.

మాలిక్ రహిమహుల్లాహ్ ఇలా పలికారు: "స్వయంగా తన తరుఫున మరియు తన కుటుంబం తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానాన్ని ఒక అక్కర గల వానికి అందజేయటంలో ఎలాంటి తప్పూ లేదు."[32]

---

[31] . అల్ ఉమ్మ్: బాబ్ దాయత్ జకాతుల్ ఫిత్ర్ ఖబ్ల ఖస్మిహా.

[32] . అల్ ముదవ్వనహ్, ౧వ భాగం, బాబ్ ఫీ ఖస్మ్ జకాతుల్ ఫిత్ర్.

ఒకవేళ ఎవరైనా (అనాలోచితంగా) ఒక సాఅ కంటే తక్కువ మోతాదులో బీదవానికి ఇస్తే, వెంటనే అతని తప్పును అతనికి తెలియజేయవలెను. ఎందుకంటే దానిని అతను స్వయంగా తన జకాతుల్ ఫిత్ర్ దానం చెల్లించేందుకు మార్చవచ్చు.

ఒకవేళ ఎవరైనా బీదవాడు ఇతరుల నుండి జకాతుల్ ఫిత్ర్ తీసుకున్న తర్వాత, అతని వద్దకు అతని అవసరాలకు మించిన ఆహార ధాన్యాలు చేరిపోతే, అతను స్వయంగా తన తరుఫున మరియు అతను పోషిస్తున్న ఇతరుల తరుఫున జకాతుల్ ఫిత్ర్ దానం ఇవ్వటానికి అతనికి అనుమతి ఉంది. అయితే అతని వద్ద నున్న ఆహార ధాన్యం (జకాతుల్ ఫిత్ర్ గా) స్వీకరించబడేదై ఉండాలి. (అంటే అది సరైన ఆహార ధాన్యం అయి ఉండాలి మరియు లెక్కకు సరిపడా ఉండాలి).

## జకాతుల్ ఫిత్ర్ దానం ఎక్కడ ఇవ్వాలి ?

ఇబ్నె ఖుదామహ్ రహిమహుల్లాహ్ ఇలా అన్నారు: "జకాతుల్ ఫిత్ర్ గురించైతే, అక్కడ అతని సంపద ఉన్నా, లేకపోయినా – అది అతనిపై తప్పనిసరి అయిన దేశంలోనే దానిని పంచి పెట్టాలి. ఎందుకంటే, జకాతు తప్పని సరి కావటానికి కారణమదే."[33]

---

[33] . అల్ ముగ్నీ, 3వ భాగం, ఫదల్ ఇధ్దా కాన అల్ ముజక్కి ఫీ బలద్ వ మాలుహు ఫీ బలద్.

అల్ ముదవ్వనహ్ ఫిఖ్ అల్ ఇమాం అహ్మద్ రహిమహుల్లాహ్ ఇలా పలికారు: "నేనిలా అడిగాను: ఆఫ్రికా నుండి వచ్చి, ఈదుల్ ఫిత్ర్ దినమున ఈజిప్టులో ఉన్నతను తన జకాతుల్ ఫిత్ర్ దానాన్ని ఎక్కడ ఇవ్వాలి అనే విషయం గురించి ఇమాం మాలిక్ రహమహుల్లాహ్ యొక్క అభిప్రాయం ఏమిటి? మాలిక్ ఇలా అన్నారు: 'అతను ఉన్న చోటే (తప్పకుండా) ఇవ్వాలి'. ఇంకా మాలిక్ ఇలా అన్నారు: "ఒకవేళ అతని కుటుంబం ఆఫ్రికాలో అతని తరుఫున ఇచ్చి ఉంటే, అది సరైనదే.(ఆఫ్రికా అనే పదం ఆ రోజుల్లో సూచించే ప్రాంతం మరియు ఈ రోజుల్లో సూచించే ప్రాంతం ఒక్కటి కాదు.)."[34]

మనందరి ఆరాధనలను స్వీకరించమని మరియు సజ్జనుల సరసన ఉంచమని అల్లాహ్ ను వేడుకుంటున్నాము. మన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను మరియు ఆయన కుటుంబాన్ని మరియు ఆయన సహచరులను దీవించుగాక!

---

[34] . ౧వ భాగం, బాబ్ ఫీ ఇఖ్రాజ్ అల్ ముసాఫిర్ జకాతుల్ ఫిత్ర్.